క్లుప్తంగా

రూ.25 లక్షలతో బీటీ రోడ్డు



పెనుబర్తి గ్రామ ప్రధాన రహదారి

గుర్ల: మండలంలోని పెనుబర్తి గ్రామానికి సరైన రోడ్డు, వీధికాలువలు లేకపోవడంతో దశాబ్దకాలంగా ప్రజలు ఇబ్బందులు పడేవారు. స్థానిక నాయకులు ద్వారా సమస్యను తెలుసుకున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు రూ.25 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఆ నిధులతో నెల రోజుల వ్యవధిలోనే రోడ్డు, కాలువలు నిర్మాణం చేపట్టడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

శ్రీరాముని సన్నిధిలో జెడ్పీ చైర్మన్



జెడ్పీ చైర్మన్‌కు స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలం అర్తమూరు గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న సీతారామచంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు శనివారంతో ముగిశాయి. చివరిరోజు పూజా కార్యక్రమాల్లో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు. వేదపండితులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. దగ్గరుండి స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు, స్వామి చిత్రపటాన్ని అందజేశారు.

అవయవదానంపై చైతన్యం

మెరకముడిదాం: అవయవ ధానంతో మరొకరికి పునర్జన్మ ఇవ్వొచ్చని మానవీయత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బీవీ గోవిందరాజులు అన్నారు. మండలంలోని గరుగుబిల్లి గ్రామంలో శనివారం అవయవదానంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వందలాది మంది గ్రామస్తులు అవయవదానం చేసేందుకు ముందుకొచ్చారు. అవయవదానం చేస్తామని హామీ పత్రాలు ఇవ్వడంతో పాటు ప్రతిజ్ఞ చేశారు.

రుద్రభూమిలో పరమేశ్వరుడి విగ్రహం ఏర్పాటు



పరమేశ్వరుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సర్పంచ్, గ్రామ పెద్దలు

కొత్తవలస: మండలంలోని నిమ్మలపాలెం గ్రామం రుద్రభూమిలో గ్రామానికి చెందిన ఆతవ వెంకటేష్ కుటుంబ సభ్యుల సహకారంతో ఏర్పాటు చేసిన పరమేశ్వరుడి విగ్రహాన్ని స్థానిక సర్పంచ్ కొట్యాడ నిర్మలసాయి శనివారం ఆవిష్కరించారు. రూ.1,20 లక్షలతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం, దాతల సహకారంతో ఇప్పటికే రుద్రభూమిని అభివృద్ధి చేశామన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ సుధారాణి, బెల్లాన వంశీకృష్ణ

చీపురుపల్లి: పట్టణంలోని సచివాలయం-5 పరిధిలో పలు అభివృద్ధి పనులకు మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, బెల్లాన వంశీకృష్ణ శనివారం భూమిపూజ చేశారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా సచివాలయం-5కు కేటాయించిన రూ.20 లక్షలతో పిల్లపేటలో ఉన్న సామూహిక మరుగుదొడ్ల కాంప్లెక్స్‌కు ప్రహరీ, ఫ్లాట్‌ఫాంల నిర్మాణం, శ్మశానవాటికలో వాటర్‌ట్యాంక్, ట్యాపుల ఏర్పాటు తదితర పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ముల్లు పైడిరాజు, మీసాల రామారావు, గంట్యాడ బుజ్జి, సతివాడ అప్పారావు, గంట్యాడ విష్ణు, మహంతి ఉమ పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి..

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు
- దిబ్బలపాలెంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



సంక్షేమ పథకాలను లబ్ధిదారునికి వివరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఇతర ప్రజా ప్రతినిధులు

భోగాపురం: ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలన్నింటినీ నెరవేరుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డితో కలిసి రెండోరోజు చేపలకంచేరు పంచాయతీ పరిధి దిబ్బలపాలెం, ఎర్రముసలయ్యపాలెం, బోయపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ, తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. నాలుగేళ్ల కాలంలో సంక్షేమ పథకాల వల్ల ఒక్కో ఇంటికి కలిగిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇచ్చిన హామీలను నెరవేర్చిన చరిత్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిదైతే.. అధికారంలో ఉన్నంత కాలం హామీలను నెరవేర్చని హీనచరిత్ర చంద్రబాబుదన్నారున. జగనన్న తీసుకొచ్చిన అమ్మ ఒడి పథకంపై ఇష్టానుసారం మాట్లాడిన చంద్రబాబు.. ఇప్పుడు అమ్మకు వందనం అని హామీ ఇవ్వడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. బాబు వస్తే జాబు వస్తుందని గతంలో ఒకసారి మోసం చేశారని.. మరోసారి మోసం చేసేందుకు సిద్ధపడుతుండడం సిగ్గుచేటన్నారు. తన రాజకీయ స్వలాభం కోసం కుటిల రాజకీయాలు చేస్తున్న చంద్రబాబుకు ప్రజలు మరోసారి బుద్ధి చెప్పడమే కాకుండా టీడీపీని భూస్థాపితం చేయాడం తథ్యమన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలోని ప్రతి హామీని అమలు చేసి ప్రజల గుండెల్లో నిలిచిపోయారని చెప్పారు. అనంతరం స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకుని వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్ అరజల్ల నర్సింగరావు, పీటీ రెడ్డి, పడాల శ్రీనివాసరావు, పడాల భానుప్రకాష్, బైరెడ్డి ప్రభాకర రెడ్డి, సుందర హరీష్, దల్లి శ్రీనివాసరావు, కొల్లు రామ్మూర్తి, మైలపిల్లి ఎల్లారావు, సీత, కర్రోతు వెంకటరమణ, పతివాడ రామకృష్ణ, ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరావు, ఈఓపీఆర్‌డీ సురేష్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు

ప్రజల సుఖ,సంతోషాలే ముఖ్యం..

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: అన్నివర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 27వ డివిజన్‌లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. జొన్నగుడ్డి, ఉప్పరవీధి ప్రాంతాలలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల వివరాలను తెలియపరుస్తూ.. ముఖ్యమంత్రి సందేశంతో ఉన్న బుక్‌లెట్లను అందజేశారు. అలాగే స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ, నగరంలో చేపడుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఇప్పటివరకు 27 సచివాలయాల పరిధిలో పూర్తయిందన్నారు. 27వ డివిజన్‌లో నాలుగో రోజు నిర్వహిస్తున్న కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని చెప్పారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను కూడా వెనువెంటనే పరిష్కరిస్తూ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తున్నట్లు చెరప్పారు. నగరంలో ప్రధాన జంక్షన్ల అభివృద్ధితో పాటు నగర సుందరీకరణకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అధిక ప్రాధాన్యం ఇస్తున్న విషయాన్ని ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, స్థానిక కార్పొరేటర్ దుప్పాడ సునీత, వైఎస్సార్‌సీపీ నాయకులు దుప్పాడ అప్పారావు, పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



ఎమ్మెల్యే బడ్డుకొండకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న సర్పంచ్ బలరాం, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మల్యాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు శనివారంతో వైభవంగా ముగిశాయి. బహుళ సప్తమిని పురస్కరించుకుని వేకువజామున 5 గంటలకు ప్రాతః రౌపాసన, మూల మంత్రవహనం, సూక్త హోమాలు చేపట్టారు. అనంతరం 7.35 గంటలకు శిఖర, విగ్రహ, యంత్ర ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, రైల్వే సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు, డీసీసీబీ వైస్ చైర్మన్ చనమల్లు వెంకటరమణ, టూరిజం డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పప్పల బలరాం, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కనులపండువగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన..



ధ్వజస్తంభ ప్రతిష్ఠకు హాజరైన ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని ఎంబేరేయగుళ్ల గ్రామంలో 11వ శతాబ్దంలో నిర్మించిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ధ్వజ, శిఖర ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజాము 5 గంటల నుంచి విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, పంచ శయనాధివాసం, తదితర కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠ, విమాన శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలను ఆగమోక్తంగా జరిపించారు. ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ అంబళ్ల శ్రీరాములనాయుడు, డీసీసీబీ వైస్ చైర్మన్ చనమల్లు వెంకటరమణ, తదితరులు స్వామిని దర్శించుకున్నారు. సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

టారిఫ్ బోర్డుల ఏర్పాటు తప్పనిసరి

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు



సాయి ఆస్పత్రిలోని ఓపీని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఫీజులకు సంబంధించిన టారిఫ్ బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌ఓ ఎస్. భాస్కరరావు అన్నారు. పట్టణంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను, స్కానింగ్ యంత్రాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డెంగీ, మలేరియా, తదితర కేసులు నమోదైతే డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేపడితే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో చిన్నతల్లి, సన్యాసినాయుడు, సత్యారావు, పవన్ అశిస్, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులతో ఎంతో ప్రయోజనం

- ఏయూ ప్రొఫెసర్ రాజేష్‌కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏయూ ప్రొఫెసర్ రాజేష్‌కుమార్

డెంకాడ: శిక్షణ తరగతులు సాంకేతిక విద్యాబోధనకు ఎంతో ప్రయోజనంగా ఉంటాయని ఏయూ ప్రొఫెసర్ రాజేష్‌కుమార్ అన్నారు. చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో డీఎస్టీ-సెర్బ్ సహకారంతో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో డిజైన్ అండ్ సిములేషన్ ఆఫ్ మినియేచర్ యాంటినా యూజింగ్ మెషిన్ లెర్నింగ్ ఫర్ ఐఓటీ అప్లికేషన్స్ అనే అంశంపై ఆరు రోజుల పాటు జరుగుతున్న శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏయూ ప్రొఫెసర్ రాజేష్‌కుమార్, ఈ రాడార్ అంటెన్నాస్ అండ్ కంపోనెంట్స్ డివిజన్ సైంటిస్ట్ కె.సాంబశివరావు హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ డీన్ సునీల్‌ప్రకాష్, కార్యక్రమం కో ఆర్డినేటర్ ఎం.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ వైఎంసీ శేఖర్, డీన్ ఆర్. రమేష్, హెచ్‌ఓడీ షేక్‌మస్తాన్ వలీ, ఇతర విభాగాలకు చెందిన అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.



పుష్కలంగా తాగునీరు

వేసవి వచ్చిందంటే చాలు మంచినీటి కోసం ప్రజలు నానా ఇబ్బందులు పడేవారు. కాని వైఎస్సార్‌సీపీ హయాంలో అటు ప్రజా ప్రతినిధులు, ఇటు అధికారులు సమన్వయంతో వ్యవహరించడంతో తాగునీటి ఇబ్బందులు తీరాయి. నగరంలోని శివారు కాలనీలకు సైతం తాగునీరు పుష్కలంగా సరఫరా చేస్తుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాజీవ్‌నగర్ కాలనీలో శనివారం ఉదయం కుళాయిల వద్ద నీరు పట్టుకుంటున్న దృశ్యం సాక్షి కంటపడింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న యువత

విజయనగరం: విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని విజయ బ్లడ్‌బ్యాంక్‌లో శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. వేసవికాలం దృష్ట్యా రక్తం కొరత నివారించేందుకు ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు విజయనగరం యూత్ ఫౌండేషన్ సంస్థ అధ్యక్షుడు షేక్ ఇల్తామాష్ తెలిపారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చునన్నారు. 18 మంది యువత రక్తదానం చేశారు. కార్యక్రమంలో యూత్ ఫౌండేషన్ సభ్యులు అశోక్, సాయికుమార్, రాయల్ క్యాబ్స్ శరత్, విజయ్, రఘు, వినయ్, వికాస్, విజయ బ్లడ్‌బ్యాంక్ మేనేజర్ పుణ్యమంతుల శివ, విజయం హెల్ప్ ఆర్గనైజేషన్ రాము, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుర్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి రోజురోజుకు ప్రజాధరణ పెరుగుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. మండలంలోని పాలవలస గ్రామంలో వార్డు మెంబర్ గుమ్మిడి సూరమ్మతో పాటు మరో 15 కుటుంబాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.



దైవ చింతనతో గ్రామాల్లో ప్రశాంతత

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

లక్కవరపుకోట: దైవ చింతనతో గ్రామాల్లో ప్రశాంతత నెలకొంటుందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని దాసుళ్లపాలెం గ్రామంలో దేవదాయశాఖ సహకారంతో రూ.50 లక్షల అంచనా వ్యయంతో రామాలయ నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో పలు గ్రామాల్లో ఇప్పటికే పలు ఆలయాలు నిర్మించినట్లు తెలిపారు. గ్రామాలు ఆధ్యాత్మిక కేంద్రాలుగా మారినపుడు ప్రజల్లో దైవభక్తి పెరుగుతుందని, గ్రామాల్లో ప్రశాంతత నెలకొంటుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి, సర్పంచ్ ముమ్మన ధనలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు ముమ్మన ప్రసాద్, సతీష్, త్రిమూర్తులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల హర్షం



ఎమ్మెల్యే శ్రీనివాసరావును సత్కరిస్తున్న వైద్యారోగ్యశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులు

శృంగవరపుకోట: కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై కాంట్రాక్ట్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లు, పారామెడికల్ ఉద్యోగులు శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడును కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యే సమక్షంలో జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘ నాయకుడు జె.వి.ప్రసాద్ మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగుల 24 ఏళ్ల నిరీక్షణకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తెరదించారని, తమ జీవితాల్లో కొత్త వెలుగులు నింపారని ఆనందం వ్యక్తం చేశారు. గతంలో చంద్రబాబును రెగ్యులరైజ్ చేయమని అడిగితే మీకు ఇస్తున్న వేతనాలే ఎక్కువంటూ అపహాస్యం చేశారని గుర్తుచేశారు.

4,230 మంది విద్యార్థులకు జేవీవీ కిట్లు



జగనన్న విద్యాకానుక కిట్లు

గజపతినగరం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే జేవీవీ కిట్లను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేశారు. మండలంలోని 42 ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత, 8 ఉన్నత పాఠశాలల్లో 1 నుంచి పదో తరగతి వరకు చదువుతున్న 4,230 మంది విద్యార్థులకు పాఠశాలలు పునఃప్రారంభం రోజున వాటిని అందజేయనున్నట్లు ఎంఈఓ విమలమ్మ తెలిపారు. కేవీవీ కిట్లలో మూడు జతల యూనిఫాం, రెండు జతలు సాక్షులు, బూట్లు, నోట్‌పుస్తకాలు, బ్యాగ్, బెల్టు, పాఠ్య పుస్తకాలు, వర్క్‌బుక్, డిక్షనరీ ఉన్నాయి.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

దత్తిరాజేరు: మండలంలోని చినకాద గ్రామనికి చెందిన ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ ఇ.రామలక్ష్మిని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ఏపీఓ వెంకటప్పలనాయుడు శనివారం తెలిపారు. ఉపాధి పనుల్లో తప్పుడు మస్తర్లు వేసినట్లు గ్రామానికి చెందిన గేదెల అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందజేయడం జరిగిందన్నారు. వారి ఆదేశాల మేరకు ఆమెను విధుల నుంచి తొలగించినట్లు చెప్పారు.



